అందని జీతాలు.. అర్ధాకలి

రాత్రంతా నిద్రాహారాలు మాని ప్రభుత్వ సంకల్పం మేరకు ఉన్నత పాఠశాలలకు కాపలదారులుగా వ్యవహరించే రాత్రిపూట వాచ్‌మెన్‌లపైన కూటమి ప్రభుత్వం కక్ష కడుతోంది. తల్లికి వందనం పథకంలో మాత్రం ఎన్నికల సమయంలో ఒక్కో విద్యార్థికి రూ.15 వేలు చెల్లిస్తామని హామీలు గుప్పించారు. అయితే క్షేత్రస్థాయిలో అమలు చేసే సమయానికి రూ.15 వేలు కాస్త రూ.13 వేలకు మారింది. అయితే ఆ రూ.2 వేలు పాఠశాలల అభివృద్ధికి, నిర్మాణం ఖర్చులకు ఉపయోగిస్తున్నట్లు స్వయాన విద్యాశాఖ మంత్రి ప్రకటించారు. అయితే తల్లికి వందనం నిధులు జమ అయ్యి నెల కావస్తున్నప్పటికీ రాత్రిపూట విధులు నిర్వహించే వాచ్‌మెన్‌లకు మాత్రం పూర్తిస్థాయిలో వేతనాలు జమ కావడం లేదు. తల్లికి వందనంలో కత్తిరింపు చేసిన రూ.2 వేల నిధులు ఆయా పాఠశాలలకు జమ చేసి, ఉన్నత పాఠశాలలకు కాపలాగా వ్యవహరించే వాచ్‌మెన్‌లకు, ఇతర సిబ్బందికి నెలవారీ వేతనాలు జమ చేసేందుకు కూటమి ప్రభుత్వం చొరవ చూపడంలో మీనమేషాలు లెక్కిస్తోంది.


పాండూరు హైస్కూల్‌లో విధులు నిర్వర్తిస్తున్న నైట్ వాచ్‌మెన్

- హైస్కూల్ నైట్‌వాచ్‌మన్లకు నాలుగు నెలలుగా అందని గౌరవ వేతనం
- బకాయి వేతనాలు విడుదల చేయాలని వేడుకోలు

వరదయ్యపాళెం: నాలుగు నెలలుగా గౌరవ వేతనం అందకపోతే తమతోపాటు తమ కుటుంబ సభ్యులను ఎలా పోషించుకోవాలని, ఎలా బతకాలని ఉన్నత పాఠశాలల నైట్ వాచ్‌మెన్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఉన్నత పాఠశాలకు కంప్యూటర్లు, ఫర్నిచర్, క్రీడా సామగ్రి, కాంపౌండ్ వాల్, ఇతర ఆస్తులను కాపాడేందుకు నైట్ వాచ్‌మెన్‌లను గౌరవ వేతనం ప్రాతిపదికన నియమించారు. ఒక్కో నైట్ వాచ్‌మెన్‌కు నెలకు రూ.6 వేలు గౌరవ వేతనంగా నిర్ధారించి ఇచ్చారు. కూటమి ప్రభుత్వం గత నాలుగు నెలల నుంచి గౌరవ వేతనం ఇవ్వకపోవడంతో ఏం చేయాలో, జీవన విధానం ఎలాగో తెలియక ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకటి, రెండు నెలలపాటు అయితే కిరాణా షాపుల వద్ద ఇతర అవసరాలకు సర్దుబాటు చేసుకుంటామని, నాలుగు నెలలుగా ఎక్కడ అప్పు పెడతారని ప్రశ్నిస్తున్నారు. జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు సైతం పట్టించుకోకపోతే తమ పరిస్థితి మరింత అధ్వాన్నంగా మారనుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మండలాల వారీగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు:

మండలం	జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు	వాచ్‌మెన్‌ల సంఖ్య
సత్యవేడు	11	11
నాగలాపురం	05	05
పిచ్చాటూరు	06	06
బీఎన్‌కండ్రిగ	11	11
కేవీబీపురం	10	10
వరదయ్యపాళెం	06	06
నారాయణవనం	04	04

గౌరవ వేతనాలు కూడా ఇవ్వలేరా?



ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న నైట్ వాచ్‌మెన్‌లకు నాలుగు నెలలుగా గౌరవ వేతనం ఇవ్వకపోవడం బాధాకరం. నాలుగు నెలలుగా గౌరవ వేతనం ఇవ్వకపోతే ఎలా జీవిస్తారు. ఇది సరైన విధానం కాదు. ప్రభుత్వం వెంటనే స్పందించాలి. నాలుగు నెలల బకాయిలను తక్షణమే వారి బ్యాంకు ఖాతాలకు జమ చేయాలి.

–చిన్నిరాజ్, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి

ప్రభుత్వం స్పందించాలి



లక్షలాది రూపాయల ప్రభుత్వ ఆస్తులను కాపాడే నైట్ వాచ్‌మెన్‌లకు కూటమి ప్రభుత్వం ఇచ్చే గౌరవం ఇదేనా. కుటుంబ సభ్యులను వదిలి ప్రభుత్వ ఆస్తులను కాపాడుతున్నారు. వారికి ఇచ్చే గౌరవ వేతనమే తక్కువ. అది కూడా నాలుగు నెలలు నిలుపుదల చేస్తే ఎలా. ప్రభుత్వం స్పందించాలి. నైట్ వాచ్‌మెన్‌లకు న్యాయం చేయాలి.

–వెంకటేశ్వర్లు, జెడ్పీటీసీ, వరదయ్యపాళెం మండలం

ఉన్నత పాఠశాల అభివృద్ధికి చేయూత


ఏజీ పరిశ్రమ ఆధ్వర్యంలో ఉన్నత పాఠశాల ఆధునీకరణ పనులు

వరదయ్యపాళెం: మండలంలోని పాండూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధికి చిన్న పాండూరు ఏపీఐఐసీ సెజ్‌లోని ఏజీ పరిశ్రమ ముందుకొచ్చింది. ఆ మేరకు పాఠశాలలోని రెండు తరగతి గదులకు రూ.2 లక్షల సీఎస్ఆర్ నిధులతో ఆధునీకరణ పనులు చేపట్టారు. ఆ మేరకు తరగతి గదులకు పెయింటింగ్, కిటికీల పునర్నిర్మాణం, పెచ్చులూడిన పైకప్పు పనులు చేపట్టినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు మునిసుబ్రమణ్యం తెలిపారు. ఏజీ పరిశ్రమ సహకారంతో పిల్లలకు అసౌకర్యంగా ఉన్న రెండు తరగతి గదులను అభివృద్ధి చేశారని ఆయన పేర్కొన్నారు. పరిశ్రమ వారి చొరవపై విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు కృతజ్ఞత తెలిపారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 26 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శనివారం అర్ధరాత్రి వరకు 85,740 మంది స్వామి వారిని దర్శించుకోగా 35,555 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ. 3.41 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది.

క్లుప్తంగా

నాగాలమ్మకు విశేష పూజలు


ఎరుకల సాని వేషధారణలో నాగాలమ్మ

నాగలాపురం: పట్టణంలోని బీసీ కాలనీ నాగాలమ్మ ఆలయంలో తమిళ ఆడి నెల రెండో ఆదివారం సందర్భంగా నాగాలమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి ఉదయం నుంచి పెద్ద ఎత్తున మహిళలు శ్రీనాగాలమ్మను దర్శించుకున్నారు. అమ్మవారికి అర్చకులు విశేష పూజలతో పాటు ఎరుకలసాని వేషధారణలో అలంకరించి, ఆస్థానం నిర్వహించారు. అనంతరం నాగాలమ్మను గ్రామ వీధుల్లో మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ తిరువీధుల్లో ఊరేగించారు. ఏర్పాట్లను గ్రామ పెద్దలు పర్యవేక్షించారు.

గవర్నర్‌కు సాదర వీడ్కోలు


గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు వీడ్కోలు పలుకుతున్న అధికారులు

రేణిగుంట: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ తిరుమల స్వామి వారి దర్శనం అనంతరం ఆదివారం రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్నారు. జిల్లా అధికారులు ఆయనకు విమానాశ్రయంలో సాదరంగా వీడ్కోలు పలికారు. అనంతరం ఆనయ ప్రత్యేక విమానంలో విజయవాడకు పయనమయ్యారు.

ముక్కంటి సేవలో మద్రాస్ హైకోర్టు చీఫ్ జస్టిస్


ఆలయం వద్ద మద్రాస్ హైకోర్టు చీఫ్ జస్టిస్ మణీంద్ర మోహన్ శ్రీవాస్తవ

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని ఆదివారం మద్రాస్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ మణీంద్ర మోహన్ శ్రీవాస్తవ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. దక్షిణ గోపురం వద్ద ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొన్న కారు


మేర్లపాక సమీపంలో బైక్‌ను ఢీకొన్న కారు

ఏర్పేడు: ఏర్పేడు–శ్రీకాళహస్తి మార్గంలోని మేర్లపాక టోల్‌గేట్ సమీపంలో ఆదివారం రాత్రి రోడ్డు పక్కన ఆగి ఉన్న బైక్‌ను శ్రీకాళహస్తి వైపు వెళ్తున్న కారు అదుపు తప్పి ఢీకొంది. ఈ ప్రమాదంలో బైక్, కారు ముందు భాగం దెబ్బతింది. అయితే బైక్ దగ్గర ఎవరూ లేకపోవడం.. కారులో ఉన్న వారికి ఎలాంటి గాయాలు కాలేదు. పోలీసులు ప్రమాద స్థలానికి చేరుకుని విచారించారు.

జాతీయ చేనేత అవార్డు గ్రహీతకు సత్కారం


రమణయ్యను సత్కరిస్తున్న గుత్తి త్యాగరాజు

వరదయ్యపాళెం: జాతీయ చేనేత అవార్డు గ్రహీత వెంకటగిరికి చెందిన గౌరబత్తిన రమణయ్యని ఆంధ్రప్రదేశ్ దేవాంగ అభ్యుదయ సేవా సంఘం కన్వీనర్ గుత్తి త్యాగరాజు ఘనంగా సత్కరించారు. ఆదివారం ఆయన వరదయ్యపాళెంకు రావడంతో ఆయన సేవలను గుర్తు చేసుకుంటూ చేనేత రంగానికి ఆయన అందించిన సేవలకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా పలువురు స్థానిక చేనేత కార్మికులు ఆయనను కలసి కృతజ్ఞతలు తెలిపారు.

శ్మశానంలో చేతిపంపు



బుచ్చినాయుడుకండ్రిగ: మండలకేంద్రంలోని ఈబీసీ కాలనీకి సంబంధించిన శ్మశానంలో తాగునీటి చేతిపంపును ఆదివారం గ్రామ కార్యదర్శి చిరంజీవి, ఉపసర్పంచ్ మునిరాజా ఏర్పాటు చేశారు. శ్మశానంలో శవాన్ని పూడ్చిన తరువాత జరిగే పూజ క్రతువుల కోసం అవసరమైన నీటి కోసం కాలనీవాసులు ఇబ్బంది పడేవారు. దీంతో బోరు వేసి చేతిపంపును బిగించారు. దీంతో కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేశారు.

పెద్దిరెడ్డిని కలిసిన నాయకులు


పెద్దిరెడ్డి, నారాయణస్వామితో మండల నాయకులు

బుచ్చినాయుడుకండ్రిగ: రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి అరెస్టు తరువాత మండల వైఎస్సార్ సీపీ నాయకులు ఆదివారం ఉమ్మడి జిల్లాల కో–ఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని తిరుపతిలోని ఆయన నివాసంలో కలిశారు. ఆయనతోపాటే ఉన్న మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామితో మాట్లాడారు. ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్టుపై ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, మిథున్‌రెడ్డి అరెస్టు చంద్రబాబు కుట్రేనని, త్వరలోనే మిథున్‌రెడ్డి బయటకు వస్తారని ఆయన చెప్పారన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ కొణతనేని మణినాయుడు, స్టేట్ ఎస్సీ సెల్ కార్యదర్శి ఉగ్గుమూడి గురునాథం, స్టేట్ గ్రీవెన్స్ సెల్ కార్యదర్శి సాయినాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శులు జొన్నల గోపాల్‌రెడ్డి, తిరుమెర్ల రవిరెడ్డి, వైస్ ఎంపీపీ బాబురెడ్డి, ప్రసాద్‌పాల్, కిరణ్‌యాదవ్, సంజీవయ్య, సుబ్రమణ్యం, తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ విజేతగా మాదరపాకం జట్టు


విజేతగా నిలచిన మాదరపాకం జట్టు

సత్యవేడు: మండల కేంద్రంలో జరిగిన క్రికెట్ టోర్నమెంట్‌లో మాదరపాకం క్రీడాకారులు విజేతలుగా నిలిచారు. ఆదివారం సత్యవేడు, నాగలాపురం, మాదరపాకం జట్ల మధ్య క్రికెట్ పోటీ నిర్వహించారు. విన్నర్‌గా మాదరపాకం, రన్నర్‌గా నాగలాపురం జట్లు నిలిచాయి. విన్నర్‌గా నిలిచిన మాదరపాకం జట్టుకు శివకుమార్ రూ.20వేలు, రన్నర్ జట్టుకు రూ.15 వేలు మురళి(చికెన్ చిన్నా) అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆది, దయ, గజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్


రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ జయచంద్ర

రేణిగుంట: అర్బన్ పోలీస్ స్టేషన్ పరిధిలో రౌడీషీటర్లు శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అర్బన్ సీఐ జయచంద్ర హెచ్చరించారు. పట్టణంలోని అర్బన్ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం రౌడీషీటర్లకు సీఐ కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నేరాల్లో పాల్పడే వ్యక్తులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. నేరచరిత్ర గల వారు ఇకపై క్రమశిక్షణతో మెలగాలని.. సామాజిక విలువలను గుర్తించి జీవనశైలిని మార్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ట్రైనీ ఎస్ఐ స్వాతి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ట్రైనీ ఎస్ఐలుగా పలువురు



రేణిగుంట: అర్బన్ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ట్రైనింగ్ నిమిత్తం ఎస్ఐ బి.స్వాతి జాయిన్ అయ్యారు. ట్రైనింగ్ పూర్తయ్యే వరకు స్టేషన్‌లో విధులు నిర్వహిస్తానని ఆమె తెలిపారు.

నాగలాపురంలో..



నాగలాపురం: మండల కేంద్రంలోని స్థానిక పోలీస్ స్టేషన్‌లో శిక్షణ ఎస్ఐగా ప్రసాద్ ఆదివారం చేరినట్లు ఎస్ఐ సునీల్ తెలిపారు. పార్వతీపురం మన్యానికి చెందిన ఆయన పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నాగలాపురం పోలీసు స్టేషన్‌లో ఐదు నెలలపాటు శిక్షణలో ఉంటారు.

కేవీబీపురంలో..




కేవీబీపురం: పోలీస్‌స్టేషన్‌కి ట్రైనీ ఎస్ఐగా కడపకు చెందిన ఇమ్మాన్యుయేల్ నియమితులయ్యారు. ఆదివారం ఆయన కేవీబీపురంలో ట్రైనీ ఎస్ఐగా బాధ్యతలు తీసుకున్నారు. ఈ మేరకు ఎస్ఐ నరేష్‌కు రిపోర్టు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ నరేష్ స్టేషన్ సిబ్బందిని పరిచయం చేసి, మండల పరిస్థితులపై వివరించారు.

నేటి నుంచి ఆరాధనోత్సవాలు


ప్రత్యేక అలంకరణలో సొరకాయలస్వామి

నారాయణవనం: నారాయణవనంలోని సొరకాయలస్వామి జీవసమాధి 123వ మహా గురుపూజ ఆరాధనోత్సవాలకు సోమవారం ఉదయం ధ్వజారోహణం నిర్వహించనున్నారు. పది రోజులపాటు నిర్వహించే ఉత్సవాలలో ప్రతి రోజు ఉదయం 9 గంటలకు ప్రత్యేక అభిషేకాలు, మధ్యాహ్నం 12 గంటలకు ఆలయ ప్రాంగణంలో భక్తులకు ఉభయదారులతో అన్నదాన ప్రసాద వితరణ ఏర్పాటు చేసినట్లు ఆలయ అభివృద్ధి కమిటీ పేర్కొంది. ఉత్సవాలలో భాగంగా మంగళవారం ఉదయం సహస్ర కలశాలను స్థాపించి ప్రత్యేక హోమాలు అనంతరం ఉభయదారులతో మూలవర్లకు కలశ జలాలతో అభిషేకం నిర్వహిస్తున్నట్లు కమిటీ తెలిపింది. సాయంత్రం పురవీధుల్లో సొరకాయల స్వామి ఉత్సవర్ల ఊరేగింపు నిర్వహించనున్నారు. ఆగస్టు 7వ తేదీ గురువారం సాయంత్రం ధ్వజావరోహణంతో ఉత్సవాలు ముగుస్తాయని కమిటీ పేర్కొంది. మహా గురుపూజ ఆరాధనోత్సవాల సందర్భంగా ఆలయంతోపాటు నగరి వీధిని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి


అవగాహన కల్పిస్తున్న రత్నకుమార్

ఏర్పేడు: సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తతతో ఉండాలని శిక్షకుడు రత్నకుమార్ అన్నారు. మండలంలోని నాగంపల్లి సమీపంలోని ఎస్ఓఎస్ చిల్డ్రన్స్ విలేజ్‌లో ఆదివారం కుటుంబ బలోపేత కార్యక్రమం కింద పిల్లల కోసం సైబర్ భద్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వీడియో చిత్రాలతో సైబర్ నేరాల గురించి వివరించారు. అనుమానాస్పద ఆన్‌లైన్ ఘటనలు ఎదురైతే, తల్లిదండ్రులు, టీచర్లకు వెంటనే తెలియజేయాలని స్పష్టం చేశారు. మొబైల్, ఇంటర్నెట్, సోషల్ మీడియా వాడకంలో తీసుకోవలసిన జాగ్రత్తలు, వ్యక్తిగత సమాచారం రక్షణ, సైబర్ బుల్లీయింగ్ నివారణ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. లోకేషన్ ఇన్‌చార్జ్ సత్యనారాయణ, కోవర్కర్ మునిరత్నం తదితరులు పాల్గొన్నారు.

అంకాళమ్మకు సారె సమర్పణ


అంకాళమ్మ ఆలయం వద్ద పూజలు చేసుకుంటున్న అంజూరు తారక శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని పీవీ రోడ్డులో వెలసిన అంకాళమ్మ అమ్మవారికి జాతర సందర్భంగా ఆదివారం శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానం మాజీ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు అంజూరు తారక శ్రీనివాసులు అమ్మవారికి సారె సమర్పించారు. ముందుగా కమిటీ సభ్యులు మేళతాళాలతో ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారికి సారె సమర్పించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కమిటీ సభ్యులు శేషవస్త్రంతో సత్కరించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అంకాళమ్మ అమ్మవారి జాతర సందర్భంగా గత 20 ఏళ్లుగా తాను సారె సమర్పించడం చాలా సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు గైక్వాడ్ కార్తీక్ రావు, నల్వాడే ప్రసన్న రావు, జొన్నలగడ్డ మురళి, మొహితే పరమేశ్వర రావు, పవార్ శ్రావణ్ రావు, నల్వాడే రాజేశ్వర్ రావు, బాలాజీ రావు, శ్రీకాళహస్తి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ యువజన సంఘం అధ్యక్షుడు శ్రీవారి సురేష్, నియోజవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షుడు పఠాన్ ఫరీద్, దేవస్థానం మాజీ ధర్మకర్తల సభ్యుడు ఆవుల పార్థీ శ్రీనివాసులు, హరి, జీవీకే రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా గంగమ్మ జాతర


తొండూరు గంగమ్మ తల్లి జాతరలో నూకతోటి రాజేష్‌ను సత్కరిస్తున్న సర్పంచ్ రమణయ్య

వరదయ్యపాళెం: మండలంలోని తొండూరులో జరిగిన గంగమ్మ తల్లి గ్రామ జాతరలో సత్యవేడు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నూకతోటి రాజేష్, పార్టీ శ్రేణులతో కలసి హాజరయ్యారు. ఆదివారం జరిగిన జాతరకు వచ్చిన ఆయనకు స్థానిక సర్పంచ్ రమణయ్య, వైఎస్సార్ సీపీ యువ నాయకుడు బాషా ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అమ్మవారిని ఆయన దర్శనం చేసుకోగా శాలువాలతో ఆయనను సత్కరించారు. ఆయన వెంట మండల పార్టీ అధ్యక్షుడు నాయుడు దయాకర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి బీరేంద్ర వర్మ, మాజీ సింగిల్ విండో చైర్మన్ హరిబాబురెడ్డి, ఉమ్మడి చిత్తూరు జిల్లా అధికార ప్రతినిధి చిన్నా, వైస్ ఎంపీపీ శ్యామలమ్మ, పార్టీ సీనియర్ నాయకులు దామోదర్‌రెడ్డి, చిలమత్తూరు భాస్కర్‌రెడ్డి, పాల సుబ్రమణ్యంరెడ్డి, నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షుడు బందిల సురేష్(బూత్ కమిటీ), వినోద్ యాదవ్ (యువజన), దేవళ్ల మహేంద్ర (బీసీ సెల్), శివా యాదవ్ (ప్రచార కమిటీ), రాష్ట్ర యూత్ కార్యదర్శి శిబి చక్రవర్తి, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు చంద్రారెడ్డి, బీసీ సెల్ మండల కన్వీనర్ శేఖర్ యాదవ్ పాల్గొన్నారు.

కేవీబీపురంలో..

కేవీబీపురం: మండలంలోని పాతపాళెం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ ధనుంజయులు, వైఎస్సార్ సీపీ కార్యకర్త వెంకటయ్య ఇళ్లలో నిర్వహించిన శుభ కార్యక్రమానికి సత్యవేడు సమన్వయకర్త రాజేష్ హాజరయ్యారు. మండల కన్వీనర్ గవర్ల కృష్ణయ్య, నందకుమార్, మూర్తి, ఢిల్లీబాబు, లాల్‌బాబుయాదవ్, సర్పంచులు రామ్మోహన్ వర్మ, గిరి, మైనారిటీ నేత జాకీర్, బాల సుబ్రమణ్యం, హరి పాల్గొన్నారు.

చెంగాళమ్మకు ప్రత్యేక పూజలు


పొంగళ్లు పెడుతున్న మహిళలు


శ్రీచెంగాళమ్మ దేవత ముగ్గు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని నీర్పాకోట గ్రామంలోని శ్రీచెంగాళమ్మ అమ్మవారి జాతర బ్రహ్మోత్సవాల్లో ఆదివారం అమ్మవారిని పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు వేసిన శ్రీ చెంగాళమ్మ దేవత ముగ్గు ఆకట్టుకుంది. అనంతరం దేవాలయంలోని శ్రీసుబ్రమణ్యం స్వామి, శ్రీవినాయక స్వామి విగ్రహాలను, నవగ్రహాలను పూలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం గ్రామంలోని మహిళలు భక్తిశ్రద్ధలతో పొంగళ్లు పెట్టి, అంబుళ్లు తీసుకొచ్చి భక్తులకు పంపిణీ చేశారు. శ్రీచెంగాళమ్మ దేవత ఉత్సవమూర్తులను గ్రామంలో ఊరేగించారు. భక్తులు ఎదురు పొంగళ్లు పెట్టారు. ఈ కార్యక్రమంలో భక్తులు భారీ సంఖ్యలో హాజరయ్యారు.

బాబు హయాంలో అంతా క్షామమే..


తుంబూరులో యువతతో మాట్లాడుతున్న నూకతోటి రాజేష్ తదితరులు

నారాయణవనం: చంద్రబాబు పాలనలో రాష్ట్ర ప్రజలు క్షామాన్ని ఎదుర్కొంటున్నారని వైఎస్సార్ సీపీ సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ పేర్కొన్నారు. మండలంలోని తుంబూరు, గోవిందప్పనాయుడు కండ్రిగలలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ.. రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. మండల పార్టీ కన్వీనర్ సొరకాయలు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాజేష్ పాల్గొన్నారు. మహిళలను కలిసి సూపర్ సిక్స్ పేరిట అమలుగాని హామీలను వివరించారు. రీకాలింగ్ మేనిఫెస్టోపై క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి వారి అభిప్రాయాలను ఆన్‌లైన్‌లో పొందుపరిచారు. తుంబూరులో జరిగిన సమావేశంలో రాజేష్ మాట్లాడుతూ జగనన్న రాష్ట్రంలో సంక్షేమ పాలనను నడిపించి అన్నివర్గాల ప్రజలకు ఫలాలను అందించారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది దాటినా ఏ ఒక్క పథకాన్ని సక్రమంగా అమలు చేయలేదని అన్నారు. వాయిదాల మాటను పక్కన పెట్టి ఇప్పటి నుండైనా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడానికి కూటమి ప్రభుత్వం పని చేయాలని డిమాండ్ చేశారు.

యువతను విస్మరించారు

యువతకు ఉద్యోగం గ్యారెంటీ అంటూ అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా కూటమి ప్రభుత్వం మాత్రం హామీని విస్మరించిందని రాజేష్ పేర్కొన్నారు. ఇంటి వద్దకే అందుతున్న రేషన్‌ను అడ్డుకుని ఎండీఆర్ ఆపరేటర్లను ఇళ్లకు పంపారని అన్నారు. భర్త మృతి చెంది ఏడాది దాటుతున్నా ఆదరణ కరువైన వితంతువులకు పెన్షన్‌ను ప్రభుత్వం ఇవ్వకపోవడం మహా దారుణమని అన్నారు. ఏళ్ల తరబడి డీకేటీ భూములను సాగు చేసుకుంటున్న వారు రైతులు కాదా అంటూ మహిళా రైతులు రాజేష్ దృష్టికి తీసుకువచ్చారు. సంక్షేమ ప్రభుత్వం కోసం రాబోయే ఎన్నికల్లో జగనన్న వెంటనే నడుస్తామని ఈ సందర్భంగా మహిళలు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమాలలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి బీరేంద్రరాజు, ఎంపీపీ దివాకర్‌రెడ్డి, ముఖ్య నాయకులు రాకేష్ కిరణ్, అన్నాదొరై, సర్పంచ్‌లు నాగూరు, మురళి, సాయిరవి, ఎంపీటీసీలు పొన్నుస్వామి, రవి, నాయకులు గురుస్వామి, పరంధామరెడ్డి, వెంకటేష్, దామోదరం, మహేష్, రమేష్, సునీల్ కార్యకర్తలు పాల్గొన్నారు.